



రోజూ పొద్దున్నే కాఫీ తాగి బజార్లో శంకర్రావు దగ్గరకు పోవడం నా అలవాటు. సెంటర్లో లాటరీ టికెట్లమ్ముతూంటాడతను. మేమిద్దరం విసుగన్నది లేకుండా కబుర్లు చెప్పుకుంటూంటాం.

నాకు ప్రస్తుతం వేరే పని లేదు. బియ్యే పరీక్షలు రాశాను. ఇంకా ఎమ్మే చదువుదామనుకుంటున్నాను కాబట్టి, పరీక్షా ఫలితాల గురించి

# కలల వ్యాపారం

జొన్నలగడ్డ రామలక్ష్మి




ఎదురు చూడ్డం మినహా వేరే పని లేదు. రోజూ పొద్దున్నే శంకర్రావు దగ్గరకు రావడమూ- సెంటర్లోకి వచ్చే రకరకాల మనుషులను చూడడమూ-అతనితో అవీ ఇవీ కబుర్లు చెప్పడమూ-నేనుచేసే పని.

శంకర్రావు నా ఈడు వాడే కాక, కొన్ని క్లాసుల వరకూ నా క్లాస్‌మేటు కూడా. అతనికీ నాకూ చాలా విషయాల్లో అభిప్రాయ భేదాలున్నాయి. కొన్ని విషయాల్లో అతనిదే రైటని నాకు తెలుసు. మరి

కొన్ని విషయాలో నేనే రైటని అతనికీ తెలుసు. అయినా ఒకరి పద్ధతి ఒకరు మార్చుకోము సరి కదా సమర్థించుకుంటూ వాదిస్తాము కూడా. ఆ వాదన తీవ్రంగా ఉండడం వల్ల, ఇద్దరం ఆవేశ పడతాము. ఆ ఆవేశంలో గంటలు క్షణాల్లా గడిచిపోతాయి. విడిపోయే టప్పుడు మళ్ళీ ఇద్దరం మంచి స్నేహితులమే! అందుకే ఎన్ని రోజులు కలుసుకున్నా మాకు బోరు కొట్టడం లేదు. అందుకే భిన్న మన స్తత్వాలమధ్య నున్న ఆకర్షణ, అభిప్రాయాలు కలపిన వారి మధ్యన ఉండదు. ఎదుటి వాడు చెప్పిన ప్రతి దానికీ అవునంటూ పోతే, ఆ సంభాషణ ఎంత సేపు రక్తి కడు తుంది? ఎన్ని రోజులు వాళ్ళు కలుసు కోగలుతారు?

శంకర్రావుకు బియ్యే దాకా చదువుకునే స్తోమతు లేకపోలేదు. కానీ అతను తన చదువును ఎక్కువ కాలం కొనసాగించలేదు. డబ్బును చదువుల మీద వృధా చేయడం ఇష్టం లేదు. వ్యాపారం గురించి అతని బుర్రలో రకరకాల ఊహలు చిన్నప్పట్నించీ ఉండేవి. ఓ ఏడాది పాటు రకరకాల వ్యాపారాలు ప్రయత్నించిఆఖరికీ లాటరీ టిక్కెట్ల ఏజన్సీ సంపాదించాడు.

"నీ కాళ్ళ మీద నీవు నిలబడా అనుకోవడం మంచిదే కానీ, నువ్వు చేస్తున్న వ్యాపారం మంచిది కాదు: కోట్ల జనంలో ఏ ఒక్కడినో వరించే అదృష్టం కోసం-అందరూ ఎగబడి కష్టపడి సంపాదించిన డబ్బు వృధా చేసుకుంటారు. సామాన్య ప్రజలకు 'ఒకటి రెండు రూపాయలంటే మాటలు కాదు. రెండు మూడు రోజులకు సరిపడా కూరలు కొనిక్కోవచ్చు" అనే వాణ్ణి నేను. లాటరీలంటే నాకు సదభిప్రాయం లేకపోవడానికి కారణం-నిజంగా సామాన్య ప్రజలు కారు. మా ఇంట్లో నన్నూ-శంకర్రావునూ పోల్చి అప్పుడప్పు డతన్ని పొగుడుతూండడం జరుగు తూంటుంది. నన్ను నేనెలా సమర్థించుకోవాలో తెలియదు. ఎవరైనా దయతల్చి ఉద్యోగమిచ్చే వరకూ నా బ్రతుకు నేను బ్రతక లేను. ఈ నా బలహీనతను కప్పి పుచ్చుకోవడం కోసం, లాటరీల్లో ఉన్న దౌష్ట్యాన్నీ, దుర్మార్గాన్నీ ఎత్తి చూపించడం అలవాటయింది నాకు. ఈ నా అభిప్రాయాలను శంకర్రావు దగ్గర కూడా అంటూంటాను.

"నేను చేసేది తప్పని నేను అనుకోవడం లేదు. నేను చాలామంది కంటె మెరుగైన

పనే చేస్తున్నాను. కలలు మనిషికి చాలా విలువైనవి. గర్భ దరిద్రుడి క్కూడా రేపన్న ఆశే ప్రాణాలు నిలుపుతుంది. ఆ రేపు గురించి ప్రతి ఒక్కడూ ఎన్నో కలలు కంటాడు. కలలు మంచివీ ఉంటాయి, చెడ్డవీ ఉంటాయి. ఒక్క రూపాయి ఖర్చుతో పది లక్షల రూపాయిల గురించి విలువైన కలలు కనవచ్చు. నా లాటరీ టిక్కెట్టు కొనమని నేనెవ్వర్నీ బల వంత పెట్టడం లేదు. ప్రజలు తమంతట తామే వచ్చి టిక్కెట్లు కొనుక్కుంటున్నారు. నిజానికి వాళ్ళు కొనేవి టిక్కెట్లు కాదు-కలలు. వాళ్ళు కొనేవైనా-నేను అమ్మేవైనా అవే! లక్ష తీయటి కబుర్లు చెప్పినా ఒక్క లాటరీటిక్కెట్ విలువరాదు" అన్నాడు శంకర్రావు.

"మనిషి బలహీనతను ఆసరాగా చేసుకుని చేస్తున్న అన్యాయమిది" అన్నాన్నేను చిరాగ్గా.

"అది చాలామంది చేస్తున్నారు. సినిమాల సంగతి తీసుకో-వినోదం పేరుతో ప్రజలను వాళ్ళు కలల్లోకి పంపేస్తున్నారు. ఒకే హీరో వంద మందిని చంపడం, కళ్ళు జిగేల్మనే భవనాల్లో సామాన్యుడు నివసించడం, ముసలి హీరోని వయసు పిల్ల ప్రేమించడం-ఇవన్నీ ఒకటి, రెండు రూపాయల ఖర్చుతో చూపి కలల ప్రపంచంలోకి వెళు తున్న ప్రజలు, సినిమాలు చూపి పొందుతున్న ప్రయోజనమేముంది? రాజకీయ నాయకులు ప్రజలకు అదే పనిగా వాగ్దానాలు చేసి వాళ్ళను కలల ప్రపంచంలోకి నెట్టి వేసి, తాము పదవి సంపాదించి, వారికి కలలే మిగిల్చి అనుభవాలన్నీ తాము పొందుతున్నారు. ఇన్నెందుకు? చదువు పేరుతో మీరు పెడుతున్న పెట్టుబడంతా కలల కోసమే కదా! ఏదో పెద్ద ఉద్యోగం వచ్చేసి నెలకు వేయి సునాయాసంగా సంపాదించ డం కోసమే కదా-మీరంతా చదువు కుంటున్నారు? అయితే ఇలా చదువుకున్న ఎంత మందికి ఉద్యో గాలు దొరుకుతాయి?" అన్నాడు.

అతను చదువు మీద దెబ్బతీసే సరికి నాకు కోపం వచ్చింది-"లాటరీ టికెట్ కొన్న ప్రతివాడికీ బహుమతి రాదు. కానీ చదువుకున్న ప్రతి వాడికీ ఎప్పటికో అప్పటికి ఉద్యోగం దొరుకుతుంది" అన్నాను.

"దొరకొచ్చు. కానీ ఒకోసారి పెట్టుబడి కూడా కిట్టదు. ఏదో పెద్ద ఆఫీసరై పోవాలని గదా-ప్రతివాడూ పెద్ద చదువులు చదువుతాడు. ఆఖరికే చిన్న గుమాస్తాయో అయ్యే వాళ్ళెక్కువ. అందు గురించి

బోలెడు డబ్బూ, సమయం వృథా. ఆ డబ్బు ముందుగానే పెట్టుబడి పెట్టి వ్యాపారం చేసుకోవాలన్న బుద్ధి కుర్రాళ్ళకుండడం లేదంటే, అందుక్కారణం రేపు గురించి వాళ్ళు కనే కలలే! ఆ విధంగా చూస్తే నేనమ్మే కలల గురించి అయ్యే ఖర్చు చాలా తక్కువ" అన్నాడు శంకర్రావు.

నా కుడుకు మోత్తనం వచ్చింది. ఏమనాలో తెలియక ఉక్రోషంగా-"నువ్వేన్ని చెప్పు-ఈ క్షణాన నా జేబులో నాలుగు రూపాయలున్నాయి. వీటిలో ఒక్కటి కూడా లాటరీ టిక్కెట్ కొనడానికి ఉపయోగించను" అన్నాను.

"అలా అనేయకు. ఒక్కటంటే ఒక్కటిక్కెట్ కొనిచూడు-కలల మజా తెలుస్తుంది" అన్నాడు శంకర్రావు.

అప్పుడే అక్కడికో కుర్రాడు వచ్చాడు. "సార్!" అన్నాడు.

అతనెవరి గురించి వచ్చాడో తెలియక నేనూ, శంకర్రావూ కూడా మాట్లాడలేదు.

"ఇంటర్మీడియేట్ చదువుతున్నానండీ! పరీక్షలవుతున్నాయి. నా పెన్నెక్కడో పడిపోయింది. ఈ పరీక్ష మీదనే నా భవిష్యత్తంతా ఆధారపడి ఉందండీ! ఎవర్నడిగినా ఇవ్వనంటున్నారండీ! ఇంట్లో డబ్బు లేదండీ! అయినా ఇప్పుడింటికివెళ్ళి అడిగే సమయం కూడా లేదండీ! మీరెవరైనా పెన్ను ఇస్తే..." అనడుగుతున్నాడతను.

మనిషిని చూస్తే విద్యార్థిలాగే ఉన్నాడు. ముఖం చూస్తే జాలి పుడుతుంది. అప్రయత్నంగా నా చేయి జేబు మీదకు వెళ్ళింది. జేబులో పెన్ను లేదు. నిట్టూర్చాను. పెన్ను జేబులో వేసుకు తిరిగే అలవాటు నాకు లేదు. శంకర్రావు కేసి చూశాను. అతని దగ్గర ఒక బాల్ పెన్నూ మామూలు పెన్నూ కూడా ఉన్నాయి. కానీ అతను ఆ కుర్రాణ్ణి విదిలించి పారేశాడు. పెన్ను ఇవ్వనని చెప్పాడు.

"పరీక్ష కెళ్ళేటప్పుడు పెన్ను జాగ్రత్త చేసుకోలేని నువ్వు పరీక్ష రాసి మాత్రం ఏం లాభం?" అంటూ ఆ కుర్రాణ్ణి హేళన కూడా చేశాడు శంకర్రావు.

ఆ కుర్రాడు జాలిగొలిపేలా తన దీనగాథను చెప్పుకున్నాడు. అతని చదువుకూ, కుటుంబానికీ ఎలా ముడిపడి ఉందో కూడా వివరించాడు. అతనికి అన్నింటికంటె ముఖ్యంగా ఎంతో టైం లేదు.

అతని మీద నాకు జాలి కలిగి,

జేబులోంచి రెండ్రూపాయలు తీసి, "వెళ్ళి ఎక్కడైనా పెన్ను కొనుక్కో" అన్నాను. ఆ కుర్రాడి కళ్ళు మెరిశాయి. అతను నా అడ్రసు తీసుకొని వెళ్ళిపోయాడు.

"ఏమిటి నువ్వు చేసిన పని? ఆ కుర్రాణ్ణి కలల ప్రపంచంలోకి పంపించడమే కదా! ఈ ఇంటర్మీడియేట్ పరీక్షలు రాస్తేనే అతని కష్టాలన్నీ తీరిపోతాయా?" అన్నాడు శంకర్రావు.

"శంకర్రావ్! నీకూ నాకూ ఓ తేడా ఉంది. ప్రజలకు కలలు అమ్ముతున్న నీకు, వారికి కలల అవసరం కనపడేలా చేయడం ముఖ్యమనుకుంటాను. నేనిప్పుడు చేసినది కలల వ్యాపారం కాదు. రెండు రూపాయల ఖర్చుతో ఒక మనిషి జీవితకాలపు కలలు నాశనం కాకుండా ఆపాను. ఆ విధంగా నీ వ్యాపారానికి అడ్డు వచ్చానేమో తెలియదు."

నేనన్న మాటల్లో శంకర్రావుకి తన లోపం కూడా అర్థమయిందనుకుంటాను- అతను కొంత సిగ్గుపడ్డాడు.

అప్పుడప్పుడు నాది కూడా పైచేయి అవుతోంది కాబట్టే శంకర్రావుతో నేను రోజూ కాలక్షేపం చేయగల్గుతున్నాను. *

---


# విజయ

## చందా వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | 36 రూ॥ |
| అర్ధసంవత్సర చందా | 18 రూ॥ |
| విడి ప్రతి | 3 రూ॥ |